

# కథా కౌముది

## శివోహం    డా.వెంకట రావు కూచిభొట్ల

అప్పటికి పావుగంట నుంచి మాణిక్యం కూలివానితో బేరమాడుతున్నాడు. ఉన్నవి మూడు సూట్కేసులు, వీటికి నాలుగు వందలా, వంద ఇస్తాను అని హిందీలో అంటున్నాడు. చుట్టూ ముగ్గురు కూలీలు నిలబడి ఉన్నారు. అందరూ ఏదో తలోమాటా అంటున్నారు, మూడు సూట్కేసులు అన్న పదం అర్థమై క్రిందికి చూశాను. మూడు సూట్కేసులు, దళసరి గుడ్డతో సూట్కేసు మాదిరి చేసిన రెండు పెద్ద సంచులు ఉన్నాయి. రైలు లోంచి క్రిందకి దింపేటప్పుడు తెలిసింది, సూట్కేసుల్లో కుక్కి మరీ సర్దారేమో చాలా బరువుగా ఉన్నాయి. సంచులు మరీ పెద్దగా ఉన్నాయేమో ఇక వాటి బరువు గురించి చెప్పనే అక్కరలేదు. మాణిక్యం గట్టిగానే దబాయిస్తున్నాడు, గట్టివాడు అనుకొన్నా కళ్లతోనే అభినందిస్తూ. వాళ్ళలో ఒకడు ప్రక్కనున్న వాడితో ఏదో అంటూ ఒక  సూట్కేసు ను బరువు తూస్తున్నట్లు పట్టుకొని లేపాడు. ఒక్కసారిగా అతని మొఖం లో రంగులు మారాయి. వెంటనే గుడ్డ సంచులు బరువు చూసి ప్రక్కనున్న ఇద్దరితో గట్టిగా ఏదో హిందీ లో అన్నాడు. అంతే, ముగ్గురు కూలీలు ఈ బేరం కుదరదని అనుకొన్నారేమో, ఏదో అనేసి అక్కడి నుండి వెళ్లబోయారు. ఈ కూలీ ఎవడో తెలివైన వెధవ, మోయాల్సిన బరువు ముందుగానే చూసుకొన్నాడు అనుకొని మాణిక్యం కేసి చూసా, ఇప్పుడు ఎలాగా అన్నట్లు.  మాణిక్యానికి రేటు పెంచక తప్పలేదులా ఉంది, మొత్తానికి ఆ సామానంతా కూలీలు బయటకి మోసుకెళుతుంటే మేమూ వెనకాలే నడిచాము.

మాణిక్యం, ఆయన భార్య, తల్లి, నా స్నేహితుడు సారధి, ఆయన భార్య శాంత,  నేనూ, కాక ఇంకా పదిమంది దాకా ఉన్నాము. నాకు వాళ్ళు అందరూ తెలీదు కానీ ఏవో పరిచయాలు కారణంగా అందరం కాశీ యాత్ర కోసం కలిశాము. మాలో మాణిక్యం అమ్మ గారికి ఎనభయ్ ఏళ్లు పైనే ఉంటాయి. ఒకప్పుడు వాళ్ళకు జమీందారుస్థాయి ఆస్తులు ఉన్నాయట. కొంత ఆక్రమణలల్లో పోయాయట, ఆస్తి పంపకాలలో ఆవిడకు అన్యాయం  జరిగితే ఆవిడ ఏమీ అనలేదుట.

ఉన్న ఆ ఆస్తిలో కొంత మళ్ళీ దానధర్మాలు చేసి పాడుచేసారని, ఆవిడ పిల్లలు పంచుకొనే సరికి ఇంకా తగ్గి పోయిందనీ కొడుకులకూ, కోడళ్లకు కోపమట. మాణిక్యంగారు ఆవిడకు పెద్ద కొడుకు. ఈ రెండు రోజుల ప్రయాణంలో ఆవిడ గూర్చి తెలిసిన విషయాలు ఇవి. ఆవిడ గూర్చి చెప్పేటప్పుడు సారధికి ఆవిడమీద చాలా గౌరవం ఉందని గమనించాను. ఆవిడను సారధి అమ్మ అనే అంటున్నాడు.

వేసవి కాలమేమో ఆ సమయంలో స్టేషన్ లోంచి బయటకు వస్తుంటే ఎక్కడా నీడ లేక ఎండకు ముఖం మాడిపోతోంది . ఆ పెద్దావిడ నడవడానికి కొంచెం ఆయాస పడటం చూసి చక్రాల కుర్చీ తెప్పిదామా అమ్మా అని సారధి ఆవిడను అడిగాడు. ఇంతవరకూ ఈవిడ కొడుకు కూలీలతో గీచి గీచి బేరమాడి ఆలస్యం చేశాడు. ఇప్పుడు వెళ్ళి చక్రాల కుర్చీ తీసుకు రావాలి, బేరమాడాలి, ఇప్పుడు సారధి ఇంకో అరగంట తినేస్తాడు అని మనసులోనే తిట్టుకొన్నా.

మాణిక్యం బదులిచ్చాడు “అబ్బే అక్కరలేదండి, ఆవిడ ఇంట్లో అయితే క్షణం కూర్చోదు. రోజంతా తిరుగుతూనే ఉంటుంది, అందుకే అంత ఆరోగ్యంగా ఉన్నారు.”

ఆవిడ సంగతేమో గానీ, ఆ మాట నాకు మాత్రం చెవిలో అమృతం పోసినట్లు అయ్యింది. రైలు ఆలస్యం అయ్యిందేమో, మేము వారణాసిలో దిగేసరికే రెండు దాటిపోయింది. తొందరగా ఈ స్టేషన్ లోంచి బయటపడి, ఏమైనా తింటేగానీ ప్రాణం నిలిచేలా లేదు అనుకొన్నాను. సారధి ఆ ముసలావిడ దగ్గరికి వెళ్ళి కొంచెం ఈ నీళ్లు త్రాగండి అని బాటిల్ ఇచ్చాడు. ఆవిడకు ఆయాసం వల్లనో, మరి దేనికో నోట మాట రాలేదు. మౌనంగా ఒకసారి ఆయన కేసి చూసి, కొంచెం తాగి ఇక చాలు అన్నట్లు చేయి ఊపారు. అనాలోచనగా నా చూపు చేతి గడియారం మీదకి వెళ్ళింది. ఇంకెంత ఒక్క అరగంట లో మనం అందరం ఆశ్రమాని వెళ్ళిపోతాము, భోజనం ఉంచమని ఫోను చేసి చెప్పాను అని సారధి నాకేసి చూస్తూ అన్నాడు. అబ్బే నాకేం తొందర లేదు, పాపం ఆవిడే పెద్దావిడ కదా భోజనం ఆలస్యమైంది ఎలాగా అని గడియారం చూశాను అంతే – కొంచెం తడబడుతూ అన్నాను. వేళ దాటితే ఆవిడ భోజనం చేయరు. మళ్ళీ ఇక రాత్రి భోజనమే అన్నారు మాణిక్యం గారు.

మాకు ఆశ్రమంలో గదులు దొరక లేదు. ప్రక్కనే ఉన్న హోటల్ వాడితో మాట్లాడి అక్కడ గదులు ఏర్పాటు చేశారు. అందరం ఎవరి గదుల్లో వాళ్ళు సామాను పడేసి, ఆశ్రమానికి భోజనాలకి వెళ్ళాము. సారధి, ఆయన భార్య, కొంచం ఆలస్యంగా వచ్చారు.

ఆయన నా ప్రక్కనే కూర్చుంటూ ఉంటే అడిగాను ”ఏం ఆలస్యం అయ్యింది?”

“ఏం లేదు అమ్మకు రెండు అరటి పళ్ళు ఇచ్చి వచ్చాను” అన్నాడు.

“దానికి ఇంత ఆలస్యమా?” అన్నాను.

"అలా కాదు, ఆవిడ మామూలుగా పుచ్చుకోరు, అందుకని చింతామణి గుడికి వెళ్ళి నైవేద్యం పెట్టి, ప్రసాదమని చెప్పి ఇచ్చాను" అన్నాడు.

అసంకల్పితంగా నా చూపు నా ఎదురుగానే ఉండి భోజనం చేస్తున్న మాణిక్యం, ఆయన భార్య, వైపుకి వెళ్ళింది.

"ఆవిడ కొడుకు చూసుకొంటాడుగా ఆవిడ గొడవ నీకెందుకు" అన్నాను.

సారధి అన్నం కలుపుకొంటూ అన్నాడు "నేను అంత ఆలోచించలేదు, అలా చేయాలనిపించింది చేశాను, వాళ్ళు లేరని కాదు" – నాతత్వం తెలిసి మాటలు కొనసాగించనీయలేదు సారధి.

మరునాడు ఉదయం కాశీ విశ్వనాథుని స్పర్శ దర్శనం, ఉదయమే నాలుగు గంటలకల్లా మనం గుడి దగ్గర ఉండాలి అని ఒకరు అంటే, ఎలా వెళ్ళాలి అని మరొకరు, ఆటోలు ఉంటాయి అని ఇంకొకరు, అలా కబుర్లతో భోజనాలు అయ్యాయి. కొంచెం సేపు అందరూ వారి వారి గదుల్లో విశ్రాంతి తీసుకొన్నాక, చీరలు చూద్దాం అని ఎవరో అంటే ఆడవాళ్ళు అందరూ బయలు దేరారు. అమ్మ గారిని ఒకసారి చూసి బయలు దేరదాము అని సారధి అంటే నేనూ లేచాను.

గది తలుపు వోరగా తీసి ఉండటంతో సారధి, ఆయన భార్య లోపలికి చనువు గా వెళ్ళి "అమ్మా కొంచెం స్థిమిత పడ్డారా?" అని అడిగారు.

అంతవరకూ కాలిమడమ నొక్కుకొంటున్న ఆవిడ కాస్త తొట్రుపడి, చీర సర్దుకొన్నారు. ఐనా కూడా వాచిన ఆవిడ కాళ్ళను మా దృష్టి నుంచి ఆవిడ దాచలేకపోయారు. చీరలు కొనడానికి అందరూ వెళుతున్నారు, మీరు వస్తారా అని సారధి అడిగాడు. సెల్ ఫోనులో వీడియో చూస్తూ ఉన్న మాణిక్యం, ఫోనులో ఎవరితోనో మాట్లాడుతూ ఉన్న ఆయన భార్య, మేమూ వస్తాము ఆలస్యం ఏమిలేదు అని గబగబా తయారయ్యారు.

శాంత ప్రక్కనే ఉన్న సారధికి పెద్దావిడ కేసి కళ్ళు తిప్పుతూ "నాకు కొంచెం అలసటగా ఉంది రాలేను మీరు వెళ్ళండి" అంది.

సారధి కళ్ళలో ఆనందానికి శాంత పెదవుల మందహాసం సమాధానం అయ్యింది. వెళ్లడానికే బయలు దేరినా, ఆవిడ అలా అనేసరికి నాకు ఏమీ అర్ధం కాలేదు.

"వెళ్లదాము అన్నారుకదా" అని అడుగుదాం అనుకొన్నా, కానీ నాకెందుకు అని ఊరుకొన్నా.

"ఐతే అమ్మకు తోడుగా ఇక్కడే కూర్చో, నీకు చీరలు నేను తీసుకుంటానులే" అన్నాడు సారధి. శాంత తలూపింది.

చీరలు కొనడం అయ్యేసరికి రాత్రి తొమ్మిది దాటింది.

మధ్యలో ఒకసారి సారధి "మీ అమ్మగారికి భోజనం ఆలస్యం అవుతుందేమో వెళదామా?" అని మాణిక్యంతో అన్నాడు.

"అబ్బే మా అత్తగారు, మేము, ఆలస్యంగానే తింటాము. మాకు అలవాటే" — మాణిక్యం భార్య చేతులు ఊపుతూ కాస్త గట్టిగానే అన్నారు చీరల పైనుంచి దృష్టి మరల్చకుండా.

మేము ఉంటున్న హోటలుకి వస్తూ మధ్యలో ఆశ్రమం వాళ్ళు ఇచ్చిన టిఫిను పొట్లాలు పట్టుకు వచ్చేసరికి రాత్రి పదిదాటిపోయింది. పెద్దావిడ పడుకొని ఉన్నారు.

ఆవిడ గదిలోంచి బయటకు వస్తూ "మీరు కనీసం నా గురించి కూడా ఆలోచించలేదా, రాత్రి పది దాటింది, ఇప్పుడు ఈ పొట్లం నా మొహాన కొడితే ఏం తింటాను, నా ప్రాణం గోతిలోకి వచ్చింది" – శాంత చిన్నగొంతుతో, అక్కడే కోప్పడుతూ పొట్లం లాక్కొని వాళ్ళ గదివైపు వెళుతుంటే, సారధి నాకేసి ఒకసారి చూసి ముందుకు వెళ్ళిపోయాడు.

ఉదయం మూడున్నరకు సారధి నుంచి ఫోను 'లేచావా?' అని. స్నానం చేసి అందరం గుడి దగ్గరకి చేరేసరికి కొంచెం ఆలస్యమే అయ్యింది. పెద్దావిడ స్పర్శ దర్శనానికి రాలేదు. మాకు దర్శనం తొందరగా అయ్యేలా చూడడానికి ఒక అతనితో బేరం కుదుర్చుకొన్నాము. నేను చెప్పిన టైమ్ ఏమిటి, ఇంత ఆలస్యం ఐతే ఎలా అని విసుక్కొంటూ క్యూలో చివర మమ్మల్ని నుంచోపెట్టి అతను ఎటో వెళ్ళాడు. ఓ పావుగంట అయ్యిందో లేదో, అతను మాదగ్గరకు వచ్చి రండి రండి అని తెలుగు లోనే అంటూ గబగబా ముందుకు తీసుకెళ్ళి, తలుపు దగ్గర అడ్డంగా నుంచున్న సెక్యూరిటీతో ఏదో చెప్పి మమ్మల్ని లోపలికి పంపేశాడు. అలా గుడి లోపలికి వచ్చినా కూడా లోపల ఇంకా చాలామందే ఉన్నారు. బయట ఉన్నజనం తో పోలిస్తే పర్లేదులే మనల్ని బాగానే ముందుకు తీసుకొచ్చేశాడు అని అనుకొన్నాము. ఆలయంలోకి వచ్చేసరికి "ఆహా ఏమి నిర్మాణం, మోది వచ్చాక చాలా మారింది మునుపు ఇలా లేదు" అని ఒకరు, "హర హర మహా దేవ్ అని ఒక్కసారిగా గట్టిగా చెవి దగ్గర అరిచే వాడు ఒకడు", మౌనంగా జపం చేసుకొనే వాళ్ళు, ఆలయంలో కుక్కలు ఉన్నాయేమిటి ఆశ్చర్యపోయేవాళ్ళు, అందరూ మధ్య మధ్య లో హర హర మహదేవ్ అని అరుస్తున్నారు. అందరినీ చూస్తూ, వెనక నుంచి గెంటేస్తున్న కారణంగా క్యూలో నడవనక్కర లేకుండా ముందుకు తూలిపడుతూ వెళ్తున్నాము. గర్భగుడి పైన కోతులు, కోతి పిల్లలూ తిరుగుతున్నాయి. మీరెంతమంది ఉన్నా మాకేం భయం అన్నట్లు అస్సలు పట్టించుకోవట్లేదు. నాకు కొంచెం విచిత్రమే అనిపించింది. ఇదే మన ఊర్లో ఐతే, గబ గబా ఇంట్లోకి వెళ్ళి తలుపేసుకోవడమో, లేదా కర్రతో వాటిని బెదిరించి దూరంగా కొట్టేయడమో చేస్తాము. కానీ ఇక్కడ వీళ్ళూ కోతుల్ని పట్టించవకోవడం లేదు, అవీ వీళ్ళకి భయపడటం లేదు అన్నాను సారధితో.

"మనమే వాటితో సఖ్యంగా ఉండట్లేదు. మన చర్యలే జంతువులలో ప్రతిచర్యగా మారతాయి" సారధి జపం చేసుకొంటూ మధ్యలో ఆపి అన్నాడు.

ఇంతలో గర్భాలయం దగ్గరకు రానే వచ్చేసాము. ఒక్క సారిగా గర్భగుడిలోకి చాలామందిని పంపడం వల్ల ఒకళ్ళపై మరొకరం పడిపోతున్నాము. దక్షిణాదిలో ఉన్నట్లు పెద్ద శివ లింగం, ఎత్తైన పానపట్టం లేవు. చిన్న శివలింగం. ఎవరో చేయి పట్టుకొని క్రిందకు గుంజారు. నేను శివ లింగాన్ని తాకడమూ, నిలదొక్కుకోలేక పడిపోబోతుంటే ఆ తోపిడికి గుడి బైటకు వచ్చేయడమూ జరిగిపోయాయి. హరహర మహాదేవ్ అన్న కేకలు నాచెవుల్లో రింగుమని మోగాయి.

దర్శనం చేసుకొని, చుట్టూ ఉన్న అమ్మవారి గుళ్లూ చూసుకొని పితృకార్యం కోసం అందరం కేదార్ ఘాట్ కు చేరాం. శ్రాద్ధకర్మ చేసే అతను తెలుగు అతనే. అతను రావడం కొంచెం ఆలస్యం అవుతుంది అని తెలిసి నీడలో అందరం కూర్చున్నాము. మాకు ప్రక్కనే కాషాయం పంచ కట్టుకొని నుదుట వీబూధితో, ఒకతను కూర్చుని ఉన్నాడు. ముష్టివాడు అనుకొంటా, అతనికి కొంచెం దూరంగా పైన నీడ కోసం ప్లాస్టిక్ గుడ్డ కట్టి ఉంది. బహుశా అది అతని నివాసం అయి ఉంటుంది. మీరు తెలుగువారా అని వచ్చీరాని తెలుగుతో పలకరించాడు. అవును క్లుప్తం గా అన్నాను. ఇంతమంది ఈ గంగమ్మతల్లి దగ్గరికి వస్తున్నారు కానీ, ఈ తల్లి గూర్చి ఎవరికీ పట్టదు, ఈ నీరు ఎలా ఉండేదో ఇలా అయిపోయింది అన్నాడు.

"గంగనీరు పాడైపోవడమా, ఎన్నాళ్లయినా గంగనీరు అలాగే ఉంటుంది తెలుసా" అని మాలో ఒకరు ప్రవచనంచెప్పే తీరులో గొంతుపెంచి అన్నాడు.

"మీరు చదువుకొన్న వారు, మీరూ అలాగే అంటే ఎలాగండి", ముష్టి వాడి మాటలకి నాకు కోపం వచ్చి,

"ఇంత మాట్లాడుతున్నావ్, ఏదైనా పని చేసుకోక ముష్టి ఎత్తుకుంటున్నావ్ ఎందుకు?" అన్నాను.

నిజానికి సిగ్గులేదా అని అందాం అనుకొన్నా, కానీ కొంచెం భయమేసి అనలేదు.

"నేను ఏమీ ముష్టి అడగలేదు, మీరు ఏమీ ఇవ్వలేదు నేను మీకు ముష్టివాడ్ని ఎలా అయ్యాను" అని అన్నాడు కొంచెం దగ్గరగా జరుగుతూ.

చిత్రంగా వాడి గొంతులో కోపము లేదు. ముష్టివాడితో నాకు మాటలేమిటి అని అనిపించింది.

వాడు దగ్గరగా జరగడం చూసి "నిజమే, ఏదో అనేశా, కానీ ఇక్కడ పితృ కార్యం చేసుకొంటాం, మరేం అనుకోకు అలా దూరంగా కూర్చో" అంటూ ఓ పది రూపాయలు జేబులోంచి తీసి అతనికి దగ్గరగా పెట్టాను.

అతను నాకేసి ఒకసారి చూసి, నోటు కేసి ఒకసారి చూసి "శివయ్య ఆజ్ఞ" అనుకొంటూ డబ్బులు తీసుకొని వెళ్ళి పోయాడు.

మధ్యాహ్నము భోజనం అయ్యాక మళ్ళీ కాశీ విశ్వనాథుని గుడికి వెళదాం, ఉదయం సరిగా దర్శనం అవలేదు అన్నారు. మాఅమ్మగారిని కూడా తీసుకెళ్లాలి అని మాణిక్యం అన్నాడు. అందరం గుడికి బయలు దేరాము. ఎందుకో జనం

అంతగాలేరు. దర్శనం అయ్యాక మాలో కొంతమంది కొంచెం ప్రక్కగా చితికిల బడ్డారు, కొంతమంది చుట్టూ ఉన్నవి చూస్తున్నారు. పెద్దావిడ జ్ఞానవాపి దగ్గర కొంత సేపు ఆగి, మసీదు వైపు చూస్తున్న నంది దగ్గర నిలబడ్డారు.

"ఎలా ఉన్నావయ్యా?" అన్న మాట విని వెనక్కి తిరిగి చూసా.

ఈ ప్రయాణంలో పెద్దావిడ మాట్లాడుతుంటే వినడం నాకు అదే మొదటి సారి. ఆవిడ నందిని నిమురుతూ అంటున్నారు "ఆలయం ధ్వసం కావడమూ, శివయ్య బావిలో ఐక్యమై పోవడమూ చూసావు, ఐనా ఇక్కడే ఉండిపోయావు, శివయ్య కోసం తపస్సు చేస్తున్నావా, నీ కోసమైనా ఆ శివుడు మళ్ళీ వస్తాడా?" – చేత్తో నిమురుతూ ఆవిడ నందితో అలా అంటుంటే, నాకేదో అయినట్లు అనిపించింది. ఉన్నటుండి ఏదో మార్పు – చుట్టూ గాఢమైన నిశబ్దం. ఘనీభవించిన కాంతి. చైతన్యము నిండిన స్థాణువుగా తేజస్సుతో నంది, అంతే స్థిరంగా, తేజస్సుతో జ్ఞానవాపి, నిశ్శబ్దానికి భయపడి కదలని ఆకులు, గాలి, ఊపిరి బిగపట్టి నిలబడిపోయిన కాలము, అంతటా పరచుకొన్న నిశ్చలమైన చైతన్యము,

............................

"ఏమైంది నీకు?" భుజం మీద ఎవరో చేయి వేసి కుదుపుతున్నారు. చూశాను, ఎదురుగా సారధి. నిశబ్దం ఎక్కడాలేదు, అంతా ఏదో గోలగా మాట్లాడుకొంటున్నారు, హరహర మహాదేవ్ అని అరుస్తున్నారు. ఎక్కడ ఉన్నానో, ఏం జరుగుతోందో క్షణం అర్ధం కాలేదు. సారధి కొంచెం ఆందోళనగా నాకేసి చూస్తున్నాడు.

నెమ్మదిగా కొంచెం తెరుకొన్నాక "ఏమీలేదు, పద వెళదాం" అన్నాను. నాకేసి విచిత్రంగా చూస్తూ సరే నెమ్మదిగా వెళదాములే తొందరలేదు, అని నా చేయి పట్టుకొని కదిలాడు. గంగాహారతి దగ్గరకు చేరేసరికి కొంచెం ఆలస్యమైంది. సారధి తన భార్య ఉన్నచోటుకి వెళ్ళి తన ప్రక్కనే కూర్చున్నాడు. చోటు దొరక్క నేను వేరేచోట నిలబడ్డాను.

హారతి పూర్తయి, ఒక్కొక్కరూ లేచి వెళ్లిపోతున్నారు. దూరంనుంచి సారధి "రా" అన్నట్లు చేయి ఊపితే, నేను కాసేపు ఉంటాను మీరు వెళ్ళండి అన్నట్లు చేయి ఊపాను. సరే అని వాళ్ళు వెళ్ళిపోయారు.

నెమ్మదిగా అందరూ వెళ్ళిపోయి ఆ ప్రాంతమంతా చీకటి, నిశ్శబ్దం పరచుకొన్నాయి. నాకు నేనే కనిపించని చీకటి. క్రమంగా నక్షత్రాలు కనిపించడం మొదలైంది. దూరంగా గంగకు ఆవల తూర్పున ఉదయిస్తున్న కృష్ణ పక్ష చవితి చంద్రుడు. నేను అనే మాయ కొద్దిగా తొలగి, అది ఇంకా ఎరుకలోకి రాని భోగిలా ఉన్నాడు చంద్రుడు. చిమ్మచీకటి పోయి, మసక వెలుతురు కొద్దిగాపరచుకొంది. దూరం నుంచి ఏదో కదులుతున్నట్లు అనిపించింది. బాగా దగ్గరికి వచ్చాక ఎవరో మనిషి ఆకారంలా అనిపించింది. నాకు కొద్ది దూరంలో నిలబడి ఈ చీకట్లో ఒక్కరే ఉన్నారెందుకు అని హిందీలో అడిగాడు. ఏమంటున్నాడో అర్ధంకావట్లేదు అని అనుకొంటూ, "హిందీ మాలూమ్ నై" అన్నాను.

"తెలుగువారా?" అని, ఈసారి తెలుగులో "ఒక్కరే ఉన్నారెందుకు" వచ్చీరాని తెలుగులో అన్నాడు.

"ఊరికే, ఇక్కడ బాగుందికదా అని ఉండిపోయా" మాట్లాడడం ఇష్టంలేక ముక్తసరిగా అన్నాను.

"నేనూ ఊరికే అలా నడుస్తుంటే ఎవరో ఉన్నట్లు అనిపించి ఇలా వచ్చాను. అకారణంగా ఎవరూ కలవరు, విడిపోరు, శివయ్య లీల" అన్నాడు.

ఎందుకో విశ్వనాథుని గుడిలో అనుభవం అతనితో చెప్పాలనిపించి చెప్పాను. అతను కొంచెం దగ్గరికి వచ్చి, చంద్ర కాంతిలో నా మొఖం కేసి చూసి మౌనంగా ఉండిపోయాడు. కొంత సేపు అయ్యాక దీర్ఘంగా నిట్టూర్చి గంగపైపు వెళ్ళి, అటువైపే తిరిగి కూర్చున్నాడు. చీకటిలో కలిసీకలవని అతని వీపుభాగం, అతనిచే కప్పబడిన చంద్రుడు, చంద్రకాంతులీనుతున్న గంగ, చిత్రంగా కనిపించాయి. అతని నిట్టూర్పు నాలో సందేహాలను రేకెత్తించాయి.

"ఎందుకు అలా నిట్టూర్చారు, మీకు ఏమైనా అర్థమైందా?" అన్నాను.

"అర్థం కాకే నిట్టూర్చాను, నీ స్థితివేరు, నీకు కలిగిన అనుభవంవేరు" అన్నీ వదిలేసిన సన్యాసులకు కూడా అది దక్కట్లేదు." అతని సమాధానం మరింత అయోమయాన్ని కలిగించి, అతను "నువ్వు" అన్నా పట్టించుకోలేదు. కొంచెం తెలిసేలా చెప్పండి అన్నాను.

"సాధకులు ఎంతో సాధన చేస్తే నీకు కలిగిన అనుభవం కలుగుతుంది. ఎదుటి వాడికి సాయం చేస్తున్నాను అన్న అహం చేతకానీ, జాలి వల్ల కానీ బిచ్చమేసే స్థాయి నీది. గృహస్తుగా ఉండాలంటే భిక్ష వేయడం నీవిధి అని తెలిసి భక్తితో, వినయంతో చేయాలి. నువ్వు కనీసం గృహస్తుగా అవడమే కష్టం. నీ తల్లిదండ్రులు, భార్యా పిల్లల కోసం నీ కోరికల్ని, సుఖాల్ని వదులుకొంటూ వారికోసం జీవించడం మరో స్థాయి. అలా కూడా కొంత అహం వదులుకొంటాం. అవునూ, మీవారందరూ జంటగా వచ్చారు, నువ్వు ఒక్కడివే వచ్చావే?" అన్నాడు.

ఈ విషయం తనకు ఎలా తెలుసు అన్న ఆలోచన వచ్చింది కానీ, అతన్ని అడగలేదు.

"నా భార్యతో నాకు పడలేదు. తనకు కూడా జీవితంలో కొన్ని సాధించాలని ఆశయాలు ఉన్నాయి, మా ఆశలకి మేము సరిపడలేదు. మా అమ్మతో కూడా నాకు అందుకే గొడవే. ఇక కుదరదని విడిపోయాము."

"పిల్లలున్నారా?" అన్నాడతను.

"ఉన్నారు, ఇద్దరు, చిన్న పిల్లలు, తనవద్దే ఉన్నారు. తనకు ఉద్యోగం బాధ్యతలు కొంచెం ఎక్కువ, అందుకని హాస్టలులో వేసింది" అన్నాను.

"తను గానీ, నువ్వు గానీ మళ్ళీ పెళ్లి చేసుకొన్నారా?" అన్నాడు.

"లేదు, నిజానికి ఇలాగే బాగుంది, నాతో చేసే ఆవిడతో కలిసి ఉంటున్నాను" నా మాటకు అతను కొంచెం ఆశ్చర్యంగా తల కొద్దిగా నాకేసి తిప్పాడు అనిపించింది.

"సామాన్యంగా భార్యాభర్తలు ఇద్దరూ రాజీ పడుతూనే పిల్లల కోసం జీవితం గడుపుతూఉంటారు. ఆపాటి అయినా మీ ఇద్దరిలో కనీసం ఒక్కరు  మీ అహం వదులుకొన్నా కలిసి ఉండేవాళ్లు" అన్నాడు.

"మేము ఏమీ గొడవపడి విడిపోలేదు. జీవితంలో ఎదగాలి, కొన్ని సాధించాలి అనుకోవడం కూడా అహంలోకే వస్తుందా?" చాలా ఆశ్చర్యంగా అడిగాను.

"అహం అంటే – నా అభిప్రాయం, నాకు ఇష్టం, నా కోరిక, నా వాళ్ళు, .. .. ఇలా "నా" తో మొదలైయ్యే ప్రతీదీ అహమే. దాన్ని ఏదో చెడ్డ లక్షణం అన్నట్లు చూడకు, నేనూ అలా అనలేదు. జీవితం వాహనమైతే, అహం జీవితాన్ని నడిపించే ఇంధనం, అదే జీవితంకాదు. ఇంధనమే ప్రధానమైపోతే, ఉంచుకొంటే జీవితం ఆగి పోతుంది. ఇంధనం లా ఆహాన్ని మండించితే జీవితం నడుస్తుంది," రెండు నిముషాలు మౌనంగా ఉండి మళ్ళీ అన్నాడు  "సామాన్యులు గడిపే జీవితమే నీకు లేదు,  నీతో మాట్లాడమని నాకీ శివాజ్ఞ ఏమిటో."

అతను నన్ను అపహాస్యం చేస్తున్నాడా? లేక అతని స్వగతమా?, ఏమో, ఏమైనా అతనితోనే ఉండాలనిపించింది.

"ఏమైనా,  మీరు చెప్పండి నాకు వినాలనే ఉంది" అన్నాను.

అతను కొంచెం నిట్టూర్చి, అన్నాడు, "సాధారణంగా  కుటుంబ జీవితం గడపడానికి అందరూ ఎంతో రాజీ పడుతూ ఉంటారు. ఆ రాజీ వారిని బాధిస్తే అది జీవితం నడవడం లోకి రాదు, అది జీవితం కాలిపోవడం అవుతుంది. అలా కాక, కుటుంబం కోసం రాజీపడటం దేవుడు నీకు ఇచ్చిన కర్తవ్యం అనుకొనిచేస్తే బాధ కలగదు. అప్పుడు ఇంధనంమండి జీవితం కదులుతున్నట్లు అర్థం. నువ్వు, నీచుట్టూ అందరూ ఆనందంగా ఉంటారు. ఇంధనం మండితే అది తరిగిపోతుందికదా. అహం వదులుకోవడం అంటే అదే. గృహస్తాశ్రమము అందుకోసమే పెట్టారు. అందరూ తన వాళ్ళే అని అనుకొనే వాళ్ళూ కొందరు అనుకొంటారు. వారిలో అహం ఇంకా తగ్గిపోతుంది", అతను చెప్పుకుంటూ పోతుంటే నాకు రైలుస్టేషన్ లో ఎండలో నడవలేకపోయిన పెద్దావిడ, మంచినీళ్ళు ఇచ్చిన సారధి గుర్తుకు వచ్చాడు.

అలా నడవడం వల్ల కాళ్ళువాచి పోటు పెడుతుంటే, ఆవిడ కాళ్ళు పట్టడానికే  సారధి భార్య శాంత ఆగి పోయిందని, అందుకే సారధి సంతోషంతో పొంగిపోయాడని అర్థమైంది. నా స్థితి ఏమిటో నాకు అర్థం అయ్యింది. కానీ అందులో తప్పేమిటో అర్థంకాలేదు.

"నేను ఎవరి గురించీ ఆలోచించను,  పట్టించుకోను, దాని వల్ల నాకు ఉపయోగం ఉండదు సరికదా, నాకు నష్టం కూడా, కనీసం నా సమయం వృధా అవుతుంది. నా సమయం నాకు చాలా విలువైంది. అందరి గూర్చి ఆలోచించడం, పట్టించుకోవడం నా పని కాదు కదా"  అన్నాను అతని మాటలకు అడ్డం వస్తూ.

"నేను నిన్నేమీ అనడం లేదు, నువ్వు అడిగితేనే చెబుతున్నాను. కృష్ణపక్షం లో చంద్రునిలో ఎన్నో కళలు ఉంటాయి. ప్రతీదీ చంద్రుడు శివునికి దగ్గరగా వేసే అడుగునే సూచిస్తుంది. ప్రతీ స్థితీ అవసరమే, కాకపోతే, అవే కళలు శుక్ల పక్షంలోనూ కనిపిస్తాయి. కానీ అవి శివునికి దూరంగా వేసే అడుగులు. నీ స్థితి శుక్లపక్ష చంద్రుని కళ వంటిది" అన్నాడు.

నాకు ఏమీ అర్థం కాలేదు. కొంతసేపు అయ్యాక సూర్యుడు అనడానికి బదులు శివుడు అన్నాడు అని అనుకొంటే కొంత అర్థమైంది. మరిక నేను ఏమీ మాట్లాడలేదు. కొంతసేపు మౌనంగా ఉన్నాక అతను ఏమీ మాట్లాడట్లేదు అని గ్రహించి, చెప్పండి అడ్డురాను అన్నాను. చంద్రుడు ఇప్పుడు అతని తల పైభాగానికి వచ్చాడు. కాషాయవస్త్రం, తలపై జడలు కట్టిన జుట్టు, ఎవరో సాధువు అనుకొన్నాను.

"ఈరోజుల్లో మనుషులు ఇంట్లో వాళ్ళతోనే కలిసి ఉండలేరు. తల్లిదండ్రులు, అత్తమామలతో పడదు, పిల్లలతో పడదు. అహంకారానికి ఆత్మాభిమానం అని పేరు మార్చేశారు. నేను చెప్పేది నీకు అర్థం అవుతుంది అని నేను అనుకోవట్లేదు. నువ్వు అడిగావని చెప్పట్లేదు. ఈ కలయిక శివాజ్ఞ. నీ ప్రశ్న శివాజ్ఞ. అందుకే చెబుతాను. నీ ఎదురుగా ఉన్న జంతువులు, మనుషుల సంతోషం, బాధ, నీలోనూ కలగడం, వాటితో మమైక్యం కావడం అత్యంత క్లిష్ట స్థాయి. ఐతే అది సాధించడానికి ఆచారాలూ, పూజలు, జీవిత పాఠాలు, అలా ఒక్కొక్కరికి ఒక్కొక్కటి ఉపయోగపడుతుంది. ఇవి అన్నీ చేసి, అన్నిటినీ వదులుకొని సన్యాసం స్వీకరించి ఎన్నో ఏళ్లు సాధన చేసినా కూడా మాకు ఎవరికీ నీకు కలిగిన అనుభవం రాలేదు. నీ అనుభవం మాకు కలగడానికి ఏ సాధనా లేదు. ఆ స్థితిలో ఉన్న వానికి చెట్లు, రాళ్ళు, కొండలు, మహోన్నత శిఖరాలు, అన్నీ తపస్సుచేసే మునులుగా అనుభవం లోకి వస్తాయి. ఆ స్థితికి చేరడానికి ఏ దారీ లేదు కాబట్టే, శిలను దైవంగా మార్చి, పూజ చేయమని చెప్పేది. మొక్కల్లో, రాళ్లలో దైవాన్ని చూడగలిగితే ఇక సర్వం శివమయమే కదా. అది నీకు క్షణకాలమే అయినా అనుభవం లోకి వచ్చింది. నువ్వు ఉన్న స్థితికి, నీ అనుభవానికి ఎంత తేడా ఉందంటే అక్షరాభ్యాసం కూడా అవని బాలునికి ఒక ప్రొఫెసరుకీ ఉన్న తేడా. అంత గొప్ప స్థితికి చేరినా, మనిషి ప్రయాణం ఇంకా, ఇంకా, చాలా, చాలా దూరం ఉంది, చేయవలసిన సాధన ఇంకా మిగిలే ఉంటుంది" చెప్పడం ఆపి దీర్ఘంగా నిట్టూర్చి అన్నాడు "అరుదైన అనుభవం నీకు కలిగింది, నీతో సాంగత్యం నాకు కలిగింది. ఇదే ఆ పరమ శివుని సంకల్పం."

అప్పటికి చంద్రుడు బాగా పైకి వచ్చేశాడు. అతని మాటలు వింటూ అతనిని, పరిసరాలనూ సరిగా గమనించలేదు, అతను వెళ్ళడానికి లేచినిలబడి నాకేసి తిరిగితే గమనించాను, ఉదయం ఎవరికి పది రూపాయలు ముష్టి అని అనుకొంటూ వేశానో అతనే ఇతను. నేనూ లేచినిలబడ్డాను. అతను ముందు వెళుతుంటే నేనూ వెనుక అనుసరించాను. ఉన్నట్లుండి అతను ఆగిపోయి సంచీలోంచి ఏదో తీశాడు. బాదంపాలు సీసా.

అది నాకు ఇస్తూ "దీని ఖరీదు పది రూపాయలు, నీ డబ్బు తోనే కొన్నాను. నువ్వు ఇంతవరకూ ఏమీ తినలేదు, త్రాగు" అని ఇచ్చాడు.

"మీరూ తిని ఉండరు, ఇద్దరం చెరిసగం త్రాగుదాం" అన్నాను.

అతను ఆగి తన రెండు చేతులూ నా భుజంమీద వేసి, "శివునిలీల అర్థం అయ్యింది" అని, "నేను కొని ఏమీ తినను, త్రాగను,  ఎవరైనా బిక్ష మేస్తే అదే తీసుకొంటాను" చిన్నగా నవ్వి, "నువ్వు త్రాగు బాగా ఆకలిగా ఉన్నావు" అన్నాడు.

అతని మాటలు నాకు ఎలా ఉపయోగపడతాయో, అసలు ఇదంతా ఎందుకు జరిగిందో అంతా గందరగోళంగా ఉంది. ఇంతలోనే కేదారేశ్వర్ ఘాట్ కు చేరాము. ఇక్కడే ఇతనిని ఉదయం కలిసింది అనుకొన్నాను.

"హోటలుకి వెళతావా?" అని అడిగాడు.

"లేదు మీతో కాసేపు ఉంటా" అన్నాను.

అతను నవ్వి "సరే నా చోటులో నువ్వు పడుక్కో". అన్నాడు.

అది నేను ఉదయం చూసిన అతని నివాసం. నేనూ నవ్వి మెట్లుఎక్కి పైదాకా వెళ్లి నడుమ వాల్చి కళ్ళు మూసుకొన్నా. ఒక్కసారిగా అయోమయంగా అనిపించింది. కళ్ళు తెరిచినట్లుగానే ఉంది నాకు. రెండు మూడు సార్లు ప్రయత్నించి, లేచి కూర్చున్నా.

"ఏమైంది?" క్రిందనుంచి సాధువు ప్రశ్న.

"కళ్ళు మూసుకొన్నా తెరచినా ఒక్క లాగే అనిపిస్తోంది" అతనితో చెప్పాను.

"ఏం పరవాలేదు, పడుక్కోవడం ఆలస్యమైంది కదా అలాగే ఉంటుంది. ఐనా, అనుభవాలను ప్రశ్నించకూడదు, అర్థంచేసుకోవాలి అని ఆలోచించకూడదు, పదిలపరచుకోవాలని ఫోటోలు తీసుకోకూడదు, ఇతరులతో చెప్పాలి అని మాట్లాడకూడదు. అనుభూతులను పూర్తిగా ఏకాగ్రతతో అనుభ వించాలి " అన్నాడు. సరే అని తలూపాను.

గంగాప్రవాహం కనిపిస్తూనే ఉంది. చాలా దూరం నడిచానేమో నా కాళ్ళు నొప్పి పెడుతున్నాయి. పెద్దావిడ కాళ్ళనొప్పి గుర్తుకు వచ్చింది. ఆ నొప్పి మనసును బాధతో మెలిపెట్టింది. ఎంత బాధ పడింది ఆ వయసులో ఆవిడ. సమయానికి ఆవిడకు భోజనం కూడా పెట్టలేదు. ఎంత బాధ అనుభవించారో, అప్పుడు నా ఆకలి నా తిండి నేను చూసుకొన్నాను కానీ నాకు ఏమీ అనిపించలేదు. నా మనసు అంత పాషాణమా? అనుకొన్నా.

"ఇంత బరువు మోయలేక పోతున్నా కొంచెం సాయం చేయరా నాయనా" అని వినిపిస్తే అటు చూసా, శివయ్య రైలు స్టేషను లో మా సామాను మోస్తున్నాడు. ముసలి వాడై, తడబడుతూ నడవలేక పోతున్నాడు. ఇంతలో కుళ్లు బట్టలతో, ముడతలు పడిన చర్మంతో గంగమ్మ మెట్లెక్కి నాకేసి వచ్చింది.

"ఏమిరా ఈ కుళ్లుఅంతా నామీద వేస్తావ్, ఎంత నీ తల్లిని ఐతే మాత్రం, నీకు జ్ఞానం లేని రోజుల్లో భరిస్తానుకానీ, నువ్వు పెద్ద అయ్యాక కూడా భరిస్తానా?, నీవల్ల ముసలితనం తొందరగా వచ్చేస్తోంది, ఆమాత్రం పట్టించుకోవద్దా, నేను శుభ్రం చేసుకోవాలంటే స్నానానికి ఎక్కడికి వెళ్ళను?" అంది.

"గంగ నీళ్ళు ఎన్నేళ్ళు అయినా పాడవవు తెలుసా" అని సాధువుతో అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. నా గుండె బరువెక్కి పోతోంది. నా కళ్ళలో నీరు ఆగట్లేదు. నేనంటే నాకే అసహ్యమేసింది, రోత పుడుతోంది.

ఉన్నట్లుండి ముసలి వాడై పోయిన శివయ్య, గంగమ్మ, ఇద్దరూ మాయమై పోయారు. చెట్లపై నుంచి పక్షులు ఒక్కసారిగా శబ్దంచేస్తూ ఎగిరాయి. నంది నడచి వస్తుంటే మెడలో మువ్వలు మోగుతున్నాయా అని అనుకొన్నాను. లేచినిలబడ్డాను. చల్లని గాలి తాకింది. కైలాసగిరి నుంచి పంపించా, కొంచెం తెరుకో అని శివయ్య చెవిలో అన్నట్లుగా ఉంది. గుండెలోని బాధ మొత్తం పోయినట్లయింది పైకిచూశాను – ప్రసన్నమైన ఆకాశం. శివుని తేజస్సు ప్రతిఫలిస్తోందా అన్నట్లుంది. తూర్పు వైపు చూశాను. శివుని స్పర్శ తగిలి అరవికసించిన తామర పువ్వులా ఆకాశం, ఆ క్రింద ఇంకా తమస్సు వదలక లీలా మాత్రంగా కనిపించే చెట్లు, ఆవలి తీరపు ఇసుకతిన్నెలు – మాయా ప్రపంచపు సౌందర్యం ఎంత మనోహరమో చూపిస్తూ శివునికి ఆహ్వానంగా సంధ్యాదేవి నాట్యం చేస్తోంది. ఈ మాయ నన్ను తాకదు అన్నట్లుగా మెరిసిపోతూ గంగమ్మ పరువాల పల్లెపడచులా పరవళ్లు త్రోక్కుతూ, కేరింతలు కొడుతూ, సుడులు తిరుగుతూ వెళుతోంది. ఎందుకు అక్కడ సుడి తిరిగింది అనుకొన్నాను. "నీటి లోపల శివయ్య ధ్యాన ముద్రలో ఉన్నాడు" – నాకు నేనే చెప్పుకొన్నట్లు అనిపించింది. నాకేసి చూసి "రా నన్ను అభిషేకించు" అన్నట్లు అయ్యింది. గబగబా దిగుతుంటే నెమ్మది, నాకు నొప్పి కలుగుతొంది అన్నట్లు అనిపించి క్రిందికి చూశాను. అన్నింటిలో నన్ను చూసావు, మరి ఈ మెట్లలో నన్ను చూడవా అని శివయ్య అడిగినట్లుగా రాతిమెట్లు ఉన్నాయి. అవును, తను వెల్లకిలా పడుకొని, తన పొట్టపై నా పాదాలు ఉంచి నన్ను నడిపించిన నా తండ్రే ఈ శివయ్య, ఇప్పుడూ నా పాదాలు జారకుండా తన చేతులతో పట్టి మెట్లుగా ఉన్నాడు.

"ఆహా, శివుని దర్శనం కావాలంటే గంగమ్మ తల్లి ఒడ్డుకే రావాలి. ఎటు చూసినా శివుడే" ఎటు వెళ్లాలో తెలీక కొంచెం తడపడ్డాను. గంగమ్మ ఇటే రా అన్నట్లుగా అనిపించింది. ఈసారి శివయ్యకు నొప్పి లేకుండా తేలికగా అడుగులు వేస్తున్నాను. గంగమ్మ వేగంగా ఉంది జాగ్రత్త అని వెనక నుంచి స్వరం. వెనక్కి చూస్తే నిన్న నాతో మాట్లాడిన సాధువు, సాధువు రూపం దాల్చిన శివయ్య, పరుగెత్తుకొంటూ నాకేసి వస్తున్నాడు. నేను మళ్ళీ గంగమ్మ కేసి నడుస్తున్నాను.

అడుగులు గంగలో పడుతుంటే గంగమ్మ పకపకా నవ్వుతూ నన్ను ఎత్తుకొంది . గంగలో మునకలు వేస్తుంటే వెనక నుంచి పరుగున వచ్చిన జాగ్రత్త అంటూ శివయ్య భుజాలు పట్టుకొన్నాడు.

అతని కళ్ళనుంచి కూడా గంగ ఉరకలెత్తి ప్రవహిస్తోంది. "ఏమయ్యా శివయ్యా – నువ్వు గంగమ్మను శిరస్సుపై బంధించావు కానీ నీ కళ్ళలో ఆపలేకపోతున్నావు" అన్నాను.

"అవును, నా పక్కపై స్తిరంగా కూర్చొని నిన్న రాత్రంతా తపస్సులో చలనం లేని శివయ్యను చూశాను. నాకూ శివుని దర్శనం అయ్యింది" అన్నాడు.

దోసిలిపట్టి నీరు తీసుకొంటే, దోసిలిలో చేరి పాపలాఉన్న గంగమ్మ, నీటిలో ఉన్న శివయ్యకు అభిషేకం గా వదులుతుంటే తపస్వియై నా చేతులలోనుంచి జారి శివునికి నమస్కరిస్తూ అతని తల నుంచి జారి, పాదాలకు చేరుతోంది. అదే క్షణంలో మహా తేజస్సుతో విరాట్పతియై తూర్పు దిక్కున పైకిలేస్తూ కనిపించాడు – అదీ శివయ్యే. ఆ కాశీ విశ్వనాథుడే.

COMMENTS